

మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

వ్యవసాయశాఖలో పదోన్నతులు కల్పించాలి

మంత్రికి విజ్ఞప్తి చేసిన బి.కృపాకర్‌రెడ్డి

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారుల నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ వరకు పదోన్నతులు కల్పించాలని ది తెలంగాణ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘకాలంగా వ్యవసాయశాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించినందుకు శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో అసోసియేషన్ ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వ్యవసాయశాఖలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవసరాలు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ సంబంధిత ఇతర శాఖలలో వ్యవసాయ శాఖ అధికారులను నియమించినట్లయితే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులకు కార్యాలయ వసతులు కంప్యూటర్ ఆఫీస్ స్టేషనరీ వాహన సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రవీందర్, శశిధర్‌రెడ్డి, వీణ, భాగ్యమ్మ, మానస, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి



కె.సురేందర్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కె.లక్ష్మణ్

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేసి అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. డా.కె.లక్ష్మణ్ సురేందర్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజలతో నిత్యం మమేకమయ్యే సురేందర్ బీజేపీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందన్నారు.

త్యాగరాయగాన సభను హోరెత్తించిన గాయకులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ గాయనీగాయకులు తమ పాటలతో త్యాగరాయగానసభలో హోరెత్తించారు. రాగమాధురి మ్యూజిక్ అకాడమి సంస్థ ఆధ్వర్యంలో శనివారం గానసభలో శంకర్‌జైకిషన్ మ్యూజికల్ బొనాంజాను బహారో ఫూల్ బర్‌సావో పేరిట నిర్వహించిన 328వ స్టేజీ కార్యక్రమంలో ఆలపించి సినిమా పాటలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. శంకర్‌జైకిషన్ సంగీత దర్శకత్వంలో పలువురు గాయనీగాయకులు పాడిన పాటలను సీనియర్ గాయనీగాయకులు ఉత్సాహంగా పాడి వినిపించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవీ పుల్లారావు, అరుణ్‌కిషోర్, ఆనంద్‌కుమార్, సురేష్‌సింగ్, జెబా, యశోద, రాజులదేవి జ్యోతి, సావిత్రిప్రభాకర్ తదితరులు పాటలతో ఆహ్లాదపరిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శంకర్ జైకిషన్ అవార్డును సీనియర్ కాంగో డ్రమ్స్‌సరిథమ్స్ ప్లేయర్ పి.సత్యేంద్రనాథ్‌కు బహూకరించి సత్కరించారు.

‘టోల్‌ప్లాజాలవద్ద ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలి’

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజాల వద్ద ట్రామాసెంటర్లు ఏర్పాటు చేయాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టోల్‌ప్లాజాలవద్ద ప్రతి వాహన వినియోగదారుడినుంచి తప్పనిసరిగా టోల్‌ఛార్జీలు వసూలు చేస్తున్న నిర్వాహకులు నిబంధనల ప్రకారం ప్రతి టోల్‌ప్లాజావద్ద ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. వాహన వినియోగదారులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు.

దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) నేతలు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

స్ట్రీట్‌లైట్లు రిపేర్ చేయించిన బీజేపీ నేతలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో వీధిదీపాలు వెలగడంలేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ స్పందించారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు బీజేపీ నేతలు శనివారం వీధిదీపాలు రిపేర్ చేయించి వెలిగేలా చేశారు. బీజేపీ నేతలు శివకుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్‌లు సిబ్బంది వెంట ఉండి పనులు చేయించారు.

రజతోత్సవ సభకు దండులా కదలిరావాలి

● ఎమ్మెల్యే ముఠాగోపాల్



భోలక్‌పూర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, వై.శ్రీనివాస్‌రావు తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఆదివారం నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ వాదులు దండులా తరలిరావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. శనివారం భోలక్‌పూర్ లోని బాకారం మల్లన్న దేవాలయం నుంచి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు.. దేశచరిత్రలో నిలిచిపోయే విధంగా రజతోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి 60 బస్సులు, కార్లు 5వేల మందికి పైగా ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఆలేరులో కార్యకర్తలకు భోజన సౌకర్యం సైతం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకుడు బింగి నవీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రహీం, మున్వర్ చాంద్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ నాయకులు గోవింద్, మగ్బూల్, జబ్బార్, సోమన్, శివముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, కళ్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ కొడుతూ ప్రచారం

రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతూ వినూత్న రీతిలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, బీఆర్ఎస్ నాయకులు బ్యాండ్ కొడుతూ వినూత్న ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి సభకు తరలిరావాలని కోరారు.

విజయవంతం చేయాలి: కాలేరు

అంబర్‌పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భావ దినోత్సవ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం అంబర్‌పేట అలీకేఫ్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీఆర్ఎస్ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, ఎర్రబోలు నర్సింహారెడ్డి, సిద్ధార్థ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలేరు

కుసుమ భోగరాజుకు సర్వీస్ ఐకాన్ అవార్డు



భోగరాజును సత్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘసేవకులు ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజుకు సర్వీస్ ఐకాన్ అవార్డును బహూకరించారు. శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బహూకరించారు. ఈ సందర్భంగా 30 ఏళ్లుగా భోగరాజు సేవా కార్యక్రమాలతో రూపొందించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త, ప్రముఖ గాయని, నిర్వాహకురాలు ఆమని పాల్గొన్నారు.

విద్యుత్ ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటాం



ఇందిరాపార్కు విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కవాడిగూడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.లలిత అన్నారు. దీర్ఘకాలికంగా విద్యుత్ బిల్లుల్లో హెచ్చుతగ్గులు, వివిధ సమస్యలపై శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాపార్కు సబ్ డివిజన్ ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



కవాడిగూడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంటమాలజిస్ట్ విభాగం అధికారులు, సిబ్బంది

కవాడిగూడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే దోమల నివారణ సాధ్యమవుతుందని సర్కిల్ 15 సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్ అన్నారు. దోమలనివారణ కోసం శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కవాడిగూడ డివిజన్ పూల్‌బాగ్, జ్యోతినగర్, గగన్‌మహల్, దేవి ప్రసాద్ బాగ్, తాళ్లబస్తీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, ఇంటి పరిసరాలలో నీరు, చెత్త నిల్వకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : పావని



స్థానికులనుంచి సమస్యలు తెలుసుకుంటున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ తెలిపారు. వేసవికాలంలో విద్యుత్ అంతరాయం ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని జవహర్‌నగర్‌లోని గడ్డంసార్ స్కూల్ లేన్, సబ్‌లోక్ ఆస్పత్రి వీధి, స్ట్రీట్‌నెంబర్ 10 వాసులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఆమె శనివారం ఆయా ప్రాంతాల్లో బీజేపీ నేతలతో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు, ఎలక్ట్రికల్ ఎఈతో మాట్లాడి కరెంట్ తీగలపై విరిగిపడ్డ చెట్టు కొమ్మలతోపాటు ప్రమాదకరంగా వంగిన కొమ్మలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. వెలగని స్ట్రీట్‌లైట్ల రిపేర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, సంయుక్తరాణి, స్థానికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

వరంగల్ సభకు ముషీరాబాద్ నుంచి 5వేలమంది

- బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సభకు ముషీరాబాద్ నుంచి 5 వేల మందిని తరలించనున్నట్లు బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ తెలిపారు. శనివారం ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఆదివారం వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాయకత్వంలో నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పార్టీ జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం 100 బస్సులు, 200 కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఆదివారం నియోకజవర్గంలోని పలు ప్రధాన ప్రాంతాలలో పార్టీ పతాకావిష్కరణకు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరవుతారని అన్నారు. ప్రతీ డివిజన్ నుంచి 500 మంది కార్యకర్తలు బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని 200 చోట్ల పార్టీ జెండాల ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, వివిధ డివిజన్ల అధ్యక్షులు వై.శ్రీనివాస్, రాకేష్, శంకర్ ముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, మాదవ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఆటోడ్రైవర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాచిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫాతీమానగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ అబ్దుల్‌సత్తార్ (48) ఆటోడ్రైవర్. భర్తతో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లడంతో తీవ్ర మనోవేదనకు గురైన అతడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఐరన్ రాడ్‌కు తాడుతో ఉరేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీజేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా నర్సయ్యగౌడ్ ఏకగ్రీవం

నల్లకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల టీజేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మేకపోతుల నర్సయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలో జరిగిన అడహాక్ కమిటీ సభ్యుల సమావేశంలో సభ్యులు నర్సయ్యగౌడ్‌ను నియమించుకున్నారు. కో-కన్వీనర్లుగా గొల్లపల్లి నాగరాజు, జి.రూబీ స్టీవెన్‌సన్, జి.వీరారెడ్డి, కో-ఆర్డినేటర్లుగా ముత్తయ్యయాదవ్, తెలంగాణ వెంకన్న, బండి రమేష్, ఉప్పు సుధాకర్, బొల్లం శ్రీనివాస్, టి.రవీందర్ నియమితులయ్యారు.

భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం నూతన కమిటీ

ముషీరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భోలక్‌పూర్ లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు కె.వి.వెంకటేష్ నూతన కమిటీని ప్రకటించారు. ముఖ్యసలహాదారులుగా గుండు కృష్ణ, ప్రధాన కార్యదర్శులు శంకర్, అనిల్‌కుమార్, కోశాధికారిగా బైరు గోవింద్‌రాజతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ముషీరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ ఎంసీహెచ్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వాంతానా చారిటబుల్ ట్రస్ట్, గాదే రామోజీ ఫౌండేషన్, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 250 మందికి డాక్టర్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పీడీయాట్రిక్స్, అర్థోపెడిక్ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ సరిత గోవింద్, ఐద్వా నగర అధ్యక్షురాలు, ఏ.పద్మ, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముష్కరులను వదలొద్దు

● పహల్గామ్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి పలువురి వినతి



గోల్నాక డివిజన్ గంగానగర్‌లో ఫిషర్ ఉమెన్ సొసైటీ అధ్యక్షురాలు స్వరూప ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరతూ తెలంగాణ జువాలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నేహాశేఖర్, ఎన్.బాలకృష్ణ, ధర్మేందర్‌జైన్, నతదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలి: ఆర్.కృష్ణయ్య

పహల్గామ్ ఘటనలు తిరిగి జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఉగ్రవాదుల దాడిలో పహల్గామ్‌లో మృతి చెందిన వారికి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులపై ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

పర్యాటకులపై జరిగిన దాడి పిరికిపంద చర్య అన్నారు. ఉగ్రవాదుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పాకిస్థాన్‌పై ప్రపంచ దేశాల సహకారం నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు గుజ్జ సత్యం, అనంతయ్య, రాజునేత, రాజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పహల్గామ్‌లో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం



పటేల్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

హేయమైన చర్య : అమృత



తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద కొవ్వొత్తుల ర్యాలీలో కార్పొరేటర్ అమృత, వనం రమేష్

నల్లకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. శనివారం అమరులైన దేశ బిడ్డలకు ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ నల్లకుంట డివిజన్‌లోని చైతన్య నగర్, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి నుంచి కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ అంబర్‌పేటలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు.

గోల్నాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గోల్నాక డివిజన్ గంగానగర్‌లో ఫిషర్ ఉమెన్ సొసైటీ అధ్యక్షురాలు ఎం.స్వరూప ఆధ్వర్యంలో పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శనను మహిళలు నిర్వహించారు.



బాగ్‌లింగంపల్లిలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి